ప్రజాశక్తి

శనివారం 10 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

చెత్తతో సావాసం



జివిఎంసి జోనల్ కార్యాలయం చెంతనే పోగు పడిన చెత్త

- జివిఎంసి జోనల్ కార్యాలయ ఆవరణలోనే డంపింగ్
- స్థల కేటాయింపుపై కొరవడిన శ్రద్ధ
- ప్రజలకు దశాబ్దాలుగా తప్పని దోమల బెడద
- ఎంపీ, ఎమ్మెల్యేకు పట్టని వైనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రయివేటు వ్యక్తులకు అతి తక్కువ ధరకు భూమి కేటాయించడానికి తహతహలాడుతున్న ప్రభుత్వానికి జిల్లా కేంద్రంలోని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) పరిధి అనకాపల్లిలో డంపింగ్ యార్డుకు స్థలం ఇవ్వడానికి మాత్రం చేతులురావడంలేదు. అనకాపల్లి కేంద్రంలో హెల్త్ సిటీ పేరుతో 7.68 ఎకరాలను అభివృద్ధి చేసి ప్రయివేటు ఆస్పత్రులకు కేటాయించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. తుమ్మపాల రెవెన్యూలో దాదాపు రూ.40 కోట్ల విలువైన రెండెకరాల భూమిని ఏడాదికి రెండు వేలు చొప్పున 33 సంవత్సరాలకు కట్టబెడుతూ ఏప్రిల్ 28న కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీచేశారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి నివాసానికి జివిఎంసి రూ.80 లక్షలకుపైగా ఖర్చు చేసింది. డంపింగ్ యార్డు విషయం మాత్రం పట్టడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు జివిఎంసి, అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రజలంటే చులకనభావం తప్ప జవాబుదారీతనం వున్నట్లు కనిపించడంలేదు. అనకాపల్లిలో మురికి కాలువలు, వాటి నిర్వహణ సరిగాలేక దశాబ్దాలుగా దోమలు పట్టణ ప్రజలను పీడిస్తున్నాయి. దోమల బాధ నుంచి ప్రజలకు విముక్తి కలిగించే మార్గాలనెవరూ అన్వేషించకపోవడంతో పట్టణం దోమలకు పెద్ద కేంద్రంగా తయారైంది. అనకాపల్లి పురపాలక సంఘంగా వున్నప్పుడు 80 వేల జనాభాకు చెత్త నిల్వకు 12 ఎకరాల స్థలం వుండేది. దాన్ని వేర్వేరు అవసరాలకు ఉపయోగించారు. పురపాలక సంఘాన్ని జివిఎంసిలో విలీనం చేశాక అనకాపల్లి జోన్ పరిధిలోని మిగతా 2లో..

హెచ్‌ఎస్‌ఎల్‌కు మరో ప్రతిష్టాత్మక అవార్డు

డిజిటల్ విభాగంలో కృషికిగాను ప్రశంసలు



అవార్డు అందుకుంటున్న రాకేష్ ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మారిటైమ్ రంగంలో డిజిటల్ విభాగంలో చేసిన కృషికిగాను హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ ఎస్-ఎల్) ఐటి సర్వీస్ మేనేజ్‌మెంట్ అవార్డు అందు కుంది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన గవర్నెన్స్ నౌ పిఎస్‌యు ఐటి ఫోరం అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందించారు. హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌లో కీలకమైన ఐటి సంస్కరణలను విజయవంతంగా అమలు చేసినందుకుగాను సంస్థ డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్) కమాండర్ రాకేష్ ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. హెచ్ ఎస్‌ఎల్‌లో ఆయన డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేస్తూ, ఉన్న సామర్థ్యాన్ని మెరుగుపరుస్తూ డిజిటల్ ఇండియాను ముందుకు తీసుకువెళ్లాలన్న దృక్పథంలో పనిచేసిందుకు అవార్డు లభించింది. ఇతర పిఎస్‌యుల కేటగిరీలో హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌కు మహారత్న, నవరత్న, మినీరత్న విభాగాల్లో గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా రాకేష్ ప్రసాద్ మాట్లాడుతూ మారిటైం రంగంలో నూతన ఆవిష్కరణలను మరింత ముందుకు నడిపేందుకు డిజిటల్ వ్యవస్థను వేగవంతం చేయనున్నట్టు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అన్వేషించడానికి, అమలు చేయడానికి హెచ్‌ఎస్‌ఎల్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

వితంతు పింఛన్లపై కూటమి కొర్రీలు

వార్త 8లో..

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

వార్త 2లో..

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

వార్త 8లో..

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి సహకరించండి



మంత్రి అచ్చెన్నాయుడుకు సమస్యలను విన్నవిస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్య పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు తదితరులు కోరారు. శుక్రవారం విజయవాడలో మంత్రిని కలిసి మత్స్యపరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మత్స్యకారుల వేల నిషేధ భృతిని వేట విరామ సమయం సీజన్ ప్రారంభంలోనే ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ సిఫారసు చేసిన పత్రాలను మంత్రికి అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఆయిల్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. కాలిన, మునిగిన బోట్ల యజమానులకు నష్టపరిహారం ఇవ్వాలని, డీజిల్ ఆయిల్ సబ్సిడీని లీటర్‌కు ప్రస్తుతం ఉన్న రూ.9 నుండి రూ.15కి పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఫిషింగ్ హార్బర్లో మత్స్యకారులకు అవసరమగు సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ వారంలో ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన బృందంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మర పడవల సంఘం గౌరవాధ్యక్షులు పిసి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, కార్యదర్శి మున్నం బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గనగల రాజేష్ ఉన్నారు.

టిడ్కో గృహాల్లో సమస్యల తిష్ట

గగ్గోలు పెడుతున్న లబ్ధిదారులు



లీకవుతున్న పైపులైన్లు



చిలకపేటలోని టిడ్కో గృహాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో పలుచోట్ల అర్హులైన పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహాల నిర్మాణంలో డొల్లతనం బయటపడింది. దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డు చిలకపేటలో నిర్మించిన ఈ గృహాల నిర్మాణం లోపభూయిష్టంగా సాగింది. ఇక్కడ 64 గృహాలతో సముదాయాన్ని నిర్మించారు. అప్పట్లో టిడిపిలో శాసన సభ్యులుగా ఉన్న వాసుపల్లి గణేష్ కుమార్ వీటి నిర్మాణానికి చొరవ చూపారు. ఇదే ప్రాంతంలో ఉన్న కొన్ని గుడిసెలు, పెంకుటిళ్లను తొలగించి ఆ స్థలంలో టిడ్కో గృహాలను నిర్మించారు. వీటి నిర్మాణం ప్రారంభమైన కొన్నాళ్లకే గణేష్ కుమార్ టిడిపిని వీడి వైసిపిలో చేరారు. అయినప్పటికీ శాసనసభ్యునిగా ఆయన చొరవ తీసుకొని ఇక్కడ టిడ్కో గృహాల నిర్మాణం జరిగేలా చేశారు. ఒక్కొక్క కుటుంబం నుంచి రూ.3.5 లక్షలను ఒక్కొక్క గృహానికి వసూలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

చెత్తతో సావాసం

ఐదు వార్డుల్లో జనాభా 1.40 లక్షలకు చేరింది. అయినా సేకరించిన చెత్తను తరలించడానికి సెంటు స్థలంలేదు.

అనకాపల్లి జోన్‌లోని ఐదు వార్డుల నుంచి చెత్తపోగు చేసే స్థలం లేకపోవడంతో పట్టణం నడిబొడ్డునవున్న జివిఎంసి జోనల్ కార్యాలయ ఆవరణలో పోగుచేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఆదివారం సెలవుకావడంతో ఐదు వార్డుల నుంచి సోమవారం ఒక్కరోజు 80-90 టన్నుల చెత్తరాగా, మిగిలిన రోజుల్లో 60-70 టన్నుల చెత్త వస్తోంది. జోనల్ కార్యాలయంలో పోగుచేసిన ఈ చెత్తను వాహనాల్లో కాపులుప్పాడలోని జిందాల్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. నివాసిత ప్రాంతాలకు దూరంగా డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ స్థలం కేటాయింపుపై ఒత్తిడితేవడం లేదు. ప్రజల అవసరాల కంటే ప్రయివేటు వ్యక్తులు, సంస్థలకు స్థలాలు కేటాయించడంపైనే వీరి ఆసక్తంతా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చెత్తపోగు చేసి పంపించడానికి నివాసిత ప్రాంతాలకు దూరంగా కనీసం రెండెకరాల స్థలం కేటాయించినా సరిపోతుందని జివిఎంసి అధికారులు అంటున్నారు.

అనకాపల్లి నుంచి కాపులుప్పాడకు చెత్త తరలించేందుకు రోజుకు 30 వేలకుపైగా ఖర్చవుతోంది. ఇక్కడ తయారైన చెత్తను విశాఖకు తరలించకుండా స్థానికంగా వర్మీ కంపోస్టు ఎరువు తయారుచేసి విక్రయించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గి, జివిఎంసికి ఆదాయం సమకూరుతుంది. వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై అప్పటి జోనల్ కమిషనర్ షేక్ సుభాని ప్రతిపాదనలు పంపించారు. డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి పది ఎకరాల స్థలం వుంటే సరిపోతుందని జివిఎంసి అధికారులు చెబుతున్నారు.

టిడ్కో గృహాల్లో సమస్యల తిష్ట

చేశారు. వీటి నిర్మాణ సమయంలోనే లబ్ధిదారులు నిర్మాణాలు సక్రమంగా జరగడం లేదని ఆందోళన చేశారు. అయినప్పటికీ వారి గోడు పట్టించుకోలేదు. గృహాల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటికి విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు అనేక ఇబ్బందులకు గురి చేశారు. తదుపరి వాసుపల్లి చొరవతో ఆ సమస్య పరిష్కారమైంది. గృహాల నిర్మాణంలో జరిగిన లోపం వల్ల ఇప్పుడు అక్కడ నివసిస్తున్న లబ్ధిదారులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్నిచోట్ల శ్లాబులు లీక్ అవుతుండడంతో కింది అంతస్తులో ఉంటున్న వారి గదిలోకి నీటి చెమ్మ చేరుతోంది. మరుగుదొడ్లకు, పైకప్పు నుంచి నీరు ప్రవహించడం కోసం ఏర్పాటు చేసిన పైపులు ఎక్కడికక్కడ పగిలిపోవడంతో నీరంతా లీకవుతూ తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమల బెడద తీవ్రంగా ఉంది. మూడో బ్లాకు ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురికి నీరు వెళ్లేందుకు నిర్మించిన డ్రెయిన్ల నిర్మాణం లోపభూయిష్టంగా జరిగింది. దీంతో మురుగునీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడే మురికి నీరు నిల్వ ఉంటోంది. ఆ ప్రాంతం దోమలకు ఆవాసంగా మారింది. స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు అదే పార్టీలో ఉంటూ అప్పటి ఎమ్మెల్యే గణేష్ కుమార్‌కు ప్రత్యర్థిగా వ్యవహరించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు అందచేయడంలో ఎమ్మెల్యే గణేష్ కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ మహమ్మద్ సాధిక్ అప్పటిలో వైసిపి 39వ వార్డు ఇన్‌ఛార్జిగా ఉంటూ ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు గృహాలను అందజేశారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఇదే వార్డు నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందిన మహమ్మద్ సాధిక్ ఇప్పుడు కాలనీ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, కూటమికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఉన్నందున, ఆయన స్పందించి తమ టిడ్కో గృహాల కాలనీలో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



వినతులు స్వీకరిస్తున్న మీనా కుమారి

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు సంబంధించి 8 వినతులు వచ్చాయని జివిఎంసి సిటీ ప్లానర్ వి.మీనాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించేదుకుగానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడకు వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పరిష్కరిస్తారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

- మేయర్ పీలా శ్రీనివాసరావు
- జోన్ 2లో విస్తృత పర్యటన



కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మొక్కలను పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలోని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన జోన్ 2 పరిధి 10వ వార్డులోని ఇందిరా గాంధీ నగర్, రాజీవ్ నగర్, బిఎన్ఆర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆదర్శ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్ ప్రదేశం ఎక్కువగా ఉన్నందున, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగి ప్రమాదాలకు గురవుతున్నందున పోలీస్ డిపార్టుమెంట్‌తో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ ఐరన్ తగ్గించి మార్గాన్ని సులభతరం చేయాలని జోనల్ కమిషనర్ కె.కనకమాలక్ష్మిని ఆదేశించారు. ఆ సమీపాన పెట్రోల్ బంకు సర్వీస్ రోడ్డు పరిసరాల్లో, ఇందిరాగాంధీ నగర్ ప్రవేశ ద్వారం వద్ద మరమ్మతులు చేపట్టి కాలువలు నిర్మించాలన్నారు. సర్వీస్ రోడ్డులో ఎప్పటి నుంచో నిలిపి ఉంచిన వాహనాలను తొలగించాలన్నారు. ఇందిరా గాంధీ నగర్‌లో విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా ఉన్నందున వాటిని వేరొకచోటుకు మార్పు చేయాలన్నారు. రాజీవ్ నగర్‌లో రోడ్లు మరమ్మతుకు గురైనందున సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బిఎన్ఆర్ నగర్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే వాహనాన్ని తనిఖీ చేసి అందులో తూకాలను స్వయంగా పరిశీలించారు. బిఎన్ఆర్.నగర్ కొండవాలు ప్రాంతం సమీపాన ఉన్నందున తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆయనకు తెలిపారు. ఆ ప్రాంతంలో వ్యక్తిగత కుళాయిల పైపులైన్లు అస్తవ్యస్తంగా ఉన్నందున మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసి నీటికి ఇబ్బంది లేకుండా ప్రతిపాదన చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు కెవిఎన్.రవికి మేయర్ ఆదేశించారు. ప్రధాన గెడ్డలో వ్యర్థాలను గమనించి, అస్తవ్యస్తంగా ఆగిపోయి ఉన్న నిర్మాణ పనులపై ఆరా తీశారు. వెంటనే కాంటాక్టర్‌ను పిలిపించి, సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజుకు మేయర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కిషోర్, ఇఇ సుధాకర్, డిసిపి హరిదాసు, ఎసిపి తిరుపతిరావు పాల్గొన్నారు.

బీచ్ క్లీనింగ్ యంత్రం పనితీరు పరిశీలన

విశాఖ నగర పరిశుభ్రతకు, సుందరీకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆర్కే బీచ్‌లో బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని స్వయంగా నడిపి, పనితీరును పరిశీలించారు. సాగర తీరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు సూచించారు.

కెజిహెచ్‌లో మజ్జిగ వితరణ కేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న శివానంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రస్తుతం పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని కెజిహెచ్‌కు వస్తున్న రోగుల సహాయకుల దాహాన్ని తీర్చేందుకు ఆసుపత్రి ఆవరణలో బ్లడ్ బ్యాంకు ఎదురుగా ఇస్కాన్ సంస్థ సౌజన్యంతో మజ్జిగ వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ కేంద్రాన్ని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ప్రారంభించారు. రోగుల సహాయకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖ మార్కెట్లోకి సామ్‌సంగ్ ఎఫ్56

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సామ్‌సంగ్ తన ఎఫ్ సిరీస్‌లో అతి సన్నని స్మార్ట్ ఫోన్ అయిన ఎఫ్ 56ను శుక్రవారం విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ బిజినెస్ డైరెక్టర్ అక్షయ్ ఎస్ రావు మాట్లాడుతూ ఈ స్మార్ట్ ఫోన్ కేవలం 7.2 ఎంఎం మందం కలిగి ఫ్లాగ్ షిప్ గ్రేడ్ కెమెరా, ఆరు తరాల ఆండ్రాయిడ్ అప్డేట్ సైకిల్స్‌ను కలిగి ఉంటుందని, అంతేకాకుండా ఎఐ ఎడిటింగ్ సదుపాయం కలిగి ఉందని తెలిపారు. 50 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 12 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా కలిగి ఉందని తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ ఆకుపచ్చ, వైలెట్‌లలో లభిస్తుందని, ప్రారంభ ధర రూ.27999గా ఉందని పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన తలసేమియా డే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వరల్డ్ తలసేమియా డేను పురస్కరించుకొని శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో తలసేమియా డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ వ్యాధితో బాధ పడుతున్న 50 మంది చిన్నారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా శ్రీ సత్యసాయి ట్రస్ట్ (విశాఖపట్నం) అధ్యక్షులు శివకోటి మధుసూదనరావు, సైకాలజిస్ట్ డాక్టర్ పూజిత జోష్యుల, డాక్టర్ మాధవీ లత, జెఆర్‌సివైఆర్‌సి కో-ఆర్డినేటర్ ఎమ్‌డి రహంతుల్లా హాజరై ముందుగా రెడ్‌క్రాస్ స్థాపకులు సర్ జీన్ హేనరీ దునంట్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు, రెడ్‌క్రాస్ వాలంటీర్స్‌కు మెడల్స్ ఇచ్చి సత్కరించారు.

పిల్లల ఆటపాటలతో కార్యక్రమం హుషారుగా సాగింది. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.రవికుమార్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, జిల్లా కో-ఆర్డినేటర్ బి.సంతోష్, నర్సింగ్ కో-ఆర్డినేటర్ ఎ.గీత పాల్గొన్నారు.

జీవిత బీమాలో 78 శాతం వృద్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోని జీవిత బీమా కలిగిన వారి శాతం రికార్డు స్థాయిలో 78 శాతానికి చేరిందని యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ ప్రపంచంలోని ప్రముఖ మార్కెటింగ్ డేటా,విశ్లేషణ సంస్థ కాంతార భాగస్వామ్యంతో నిర్వహించిన సర్వేలో వెల్లడైందని యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ త్రిపాఠి తెలిపారు.

నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 25 భారతీయ నగరాల్లో 6360 గృహాలను ఈ సర్వే కవర్ చేసిందన్నారు.

కారెన్స్ క్లావిస్ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కారెన్స్ క్లావిస్ బుకింగ్స్ ప్రారంభమైనట్టు మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ కియా ఇండియా స్టేట్ విభాగ డైరెక్టర్ గ్వాంగు లీ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పెద్ద, బోల్డ్, విశాలమైన 3రో వాహనంగా ఇది రూపుదిద్దుకుందన్నారు. కారెన్స్ క్లావిస్ నేటి పెద్ద, ఆధునిక కుటుంబాల కోసం రూపొందించబడిందని, ఎంపివిలు, ఎస్‌యువిల మధ్య అంతరాన్ని తగ్గిస్తుందని అన్నారు.

ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం



- తాటిముంజెల్లో పుష్కలంగా విటమిన్లు
- నగరంలో ముమ్మరంగా విక్రయాలు
- గ్రామీణ ప్రాంతాల్లో తగ్గుతున్న తాటి చెట్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం: వేసవి తాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు తాటిముంజెలు ఎంతగానో దోహదపడతాయి. ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందిన ఈ తాటిముంజెల సీజన్ ప్రారంభమైంది. తాటికాయలు ముంజెలదశలో జెల్లీ మాదిరిగా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. మరో మూడు నెలల్లో తాటిముంజెలు తాటిపండ్లుగా మారడంతో పాటు, ఆరోగ్యకరమైన తేగలనూ ఇస్తాయి. ఈ ముంజెలు శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటికి డిమాండ్ ఏర్పడింది.

తగ్గుతున్న చెట్లు.. పెరుగుతున్న రేట్లు..

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో తాటి చెట్లు అధికంగా ఉండేవి. రియల్ ఎస్టేట్ కారణంగా మారుమూల గ్రామాల్లో సైతం తాటిచెట్లను నరికేస్తుండటంతో వీటి సంఖ్య ఏటా తగ్గిపోతోంది. కొన్నిచోట్ల చెట్లు ఉన్నా వాటిపైకిఎక్కి తాటికాయలు దింపే కార్మికుల కొరత ఏర్పడడంతో వీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. ఫలితంగా ముంజెల రేట్లు పెరిగిపోతున్నాయి.

మండలంలోని ఆనందపురం, గొట్టిపల్లి, వెల్లంకి తదితర గ్రామాల్లో గీత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ఏడాదికి మూడు నెలలు తాటికాయలు నుండి ముంజెలను వేరుచేసి పట్టణాలకు తీసుకెళ్లి డజను రూ.70కి విక్రయించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో తాటి ముంజెలను కాకుండా నేరుగా తాటికాయలను కొట్టుకొని తినేవారు. ప్రస్తుతం తాటికాయలు కోసేవారు లేక గ్రామీణ ప్రాంతాల్లో కూడా తాటి ముంజెలు విక్రయాలు పెరిగాయి.

భీమునిపట్నం : ప్రస్తుత వేసవిలో తాటి ముంజెలకు భలే డిమాండ్ ఉంది. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పవచ్చు. వేసవిలో ముఖంపై వచ్చే మొటిమలకు విరుగుడు ఈ తాటి ముంజెలు. శరీరానికి కావలసిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహద పడతాయి. ఇవి తినడం వల్ల జీర్ణ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. శరీరానికి కావలసిన ఎ, బి, సి విటమిన్లు ఐరన్, పొటాషియం, జింక్, ఫాస్పరస్, వంటివి పుష్కలంగా ఉండడంతో ఆరోగ్య పరంగా ఎంతో ఉపయోగ పడతాయి. శరీర బరువు తగ్గడలకూ ఉపకరిస్తాయి.

కష్టంతో కూడిన పని..


తాటికాయల నుంచి ముంజెలను తీయడంలో నైపుణ్యంతో పాటు శారీరక శ్రమ ఇమిడి ఉంటుంది. గీత కార్మికులు అనేక కష్టాలు పడుతూ వీటిని తీసి అమ్ముతుంటారు. అయితే వీరికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. తాటికాయలు తీసే క్రమంలోనూ, చెట్టు ఎక్కి దిగిన సందర్భంలోనూ మెళకువలు పాటించాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే గీత కార్మికులు ఎంతో సాహసం చేయాల్సి ఉంటుంది.

తాటి కాయల్లో రకాలు..

తాటికాయల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. ఉప్పర తాటి, కుంచాల తాటి, గజ తాటి, నల్ల కాయల తాటి ముంజెలు ఎంతో శ్రేష్టమైనవి.

ఆరోగ్యానికి మేలు..

తాటి ముంజెలు తింటే శరీరానికి కావలసిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహద పడతాయి. ఎండా కాలంలో వేడికి సాధారణంగా మలబద్దకం ఏర్పడుతుంది. ఈ సమయంలో తాటి ముంజెలు తింటే మలబద్ధకం తగ్గుతుంది.



డాక్టర్ ఎం.ఫణికుమార్
ప్రధాన వైద్యాధికారి
సిహెచ్‌సి, భీమిలి



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ దగ్గర నూకలమ్మ గుడి పక్కన ట్రైక్వాడ్ సమ్మర్ క్లాసులను వార్డు కార్పొరేటర్ కెల్లసునీత సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రావీణ్యం పొందేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఈ నెల 5నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ అలీ, శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు, మాధవ్ పాల్గొన్నారు.

మధురవాడ : రుషికొండ బీచ్ ప్రాంగణంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఎపి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశాఖలో వాటర్ గేమ్స్ పెట్టాలని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. క్రీడ యాప్‌ను అమలులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ అధ్యక్షులు బలరాం నాయుడు, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పద్మనాభస్వామి ఆలయ పున:ప్రతిష్ట

ప్రజాశక్తి -పద్మనాభం: పద్మనాభం గ్రామంలో ఉన్న అనంతపద్మనాభ స్వామి ఆలయ శిఖరం పున:ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న పసాదాలు ఏర్పాటుచేశారు. ముందుగా రూ.60 లక్షలతో నిర్మించిన ఆలయాన్ని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం స్థానిక ఎంపిపి రాంబాబు, భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, విజయనిర్మల, ఆలయ ఈవో నానాజీబాబు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామస్వామినాయుడు, టిడిపి నాయకులు కె.రమణ, కె.దామోదరరావు, కెవి.సత్య నారాయణ, కె.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ట

పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయ పున:ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆలయ శిఖరంపై ఉన్న కలశానికి పూలమాలవేసి పూజలు నిర్వహించారు. విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రూపాకుల రవికుమార్, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు, హంస మహేష్, మరగడ గౌరి రెడ్డి, కలగర్ల పేర్రాజు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

వసుధైక విజనరీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ సిఇఒ యలవర్తి అనూష కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కుంతీ మాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనూష కుటుంబీకులను టిడిపి మండల మాజీ అధ్యక్షులు కాళ్ల నగేష్‌కుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మొకర సన్నిబాబు, నాయకులు వేదుల నగేష్ సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం అనూష మాట్లాడుతూ, తన వంతుగా స్వామి వారి ప్రచారానికి సంబంధించిన బాధ్యతలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. స్వామి వారి ప్రచారానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించి ప్రపంచ వ్యాప్తంగా స్వామి విశిష్టత తెలిసేలా రోజూ ఆలయంలో జరిగే కార్యక్రమాలను పొందుపరుస్తామని తెలిపారు.

ఘాట్ రోడ్డు ప్రారంభం

మండలంలోని పద్మనాభం గ్రామంలో ఉన్న అనంతపద్మనాభ స్వామి కొండపైకి రూ.ఐదు కోట్లతో నిర్మించిన ఘాట్ రోడ్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -తగరపువలస :జివిఎంసి రెండో వార్డు పరిధి సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తాగు నీటి సరఫరా విభాగం సహాయక ఇంజినీరు జి.సురేష్ తెలిపారు. "సమస్యలతో సతమతం" శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సహాయక ఇంజినీర్ సురేష్ స్పందించి ప్రజాశక్తితో మాట్లాడారు. ఇప్పటి వరకు రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఆ ప్రాంతంలో ఒక భాగంలో తాగునీరు సరఫరా చేసేవారమని, ఈ సమయాన్ని పెంచే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కొండకు కుడి వైపు ఉన్న కుటుంబాలకు దాదాపు మూడు నెలల క్రితం సంప్ నిర్మించి దానికి అనుసంధానంగా 3 వేల లీటర్లు, 2 వేల లీటర్ల సామర్థ్యంతో కూడిన సిన్టెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేశామని తెలిపారు. 13 పబ్లిక్ కుళాయిలు ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. వేసవి నేపథ్యంలో గోస్తనీలో సహజంగానే నీటి నిల్వలు తగ్గాయని, సాధ్యమైనంతవరకు కొండ వాలు ప్రాంతాల్లో సరిపడా తాగు నీరు అందించే ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.



ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

మహిళల ఆర్థిక స్వావలంభనకు కృషి

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం, మజ్జివలస గ్రామ సహకార సంఘ కార్యాలయ భవనంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మండల స్థాయి కుట్టు శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, కుట్టు శిక్షణపై ఆశక్తి ఉన్న మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని ఉచితంగా శిక్షణ పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ ఎన్.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సరగడ అప్పారావు, టిడిపి నాయకులు మజ్జి వెంకటరావు, నీలాపు సూర్యనారాయణ, జి.ఎల్లయ్య, గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రయివేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో విద్యాశాఖ నిబంధనలు పాటించని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యా ప్రమాణాలు పాటించకుండా, ఫైర్ సర్టిఫికెట్లు, ఆటస్థలం లేకుండా తరగతులు నిర్వహిస్తున్న అంతస్తుల్లో విద్యార్థులకు ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా నడుపుతున్నారని వివరించారు. వేసవి సెలవుల్లో కూడా బ్రిడ్జి కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శేఖర్, ఉపాధ్యక్షులు కె.కిరణ్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న పినాకిల్ ప్రతినిధులు

యూనిఫాం వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : పినాకిల్ హాస్పిటల్స్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా చినగదిలి, దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర ప్రత్యేక గృహంలో బాలురకు శుక్రవారం 200 జతలు యూనిఫాం అందించారు. ఈ కార్యక్రమంలో హోం సూపరింటెండెంట్ కె.వీరయ్య, కార్పొరేట్ వ్యవహారాలు, ఆడిట్ మేనేజర్ టి.మణి, కంపెనీ సెక్రటరీ సోని కుమారి పాల్గొన్నారు.

నేడు వైసిపి మండల కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి -ఆనందపురం

వైసిపి ఆనందపురం మండల కమిటీ, అనుబంధ విభాగ కమిటీల ఎన్నిక గండిగుండం సర్పంచ్ గండ్రెడ్డి శ్రీను ఇంటి వద్ద శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన కొండప్రాంతం

మందుబాబులతో అవస్థలు

ఇబ్బందులు పడుతున్న రాధాకృష్ణ నగర్ వాసులు

ప్రజాశక్తి-సీతమ్మధార : మందు బాబులు, జూదరులు, ఆకతాయిలతో జివిఎంసి 14 వార్డు పరిధి బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లోని రాధాకృష్ణనగర్ ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొండ ప్రాంతం కావడం, పెద్ద పెద్ద చెట్లు, పొదలతో నిర్మానుష్యంగా ఉండటంతో పగలంతా జూదరులకు, సాయంత్రం ఏడు గంటల తర్వాత మందుబాబులకు అడ్డాగా మారుతోంది. వీరి ఆగడాలపై స్థానిక ప్రజలు ఎవరైనా ప్రశ్నిస్తే తిరగబడటం, గొడవకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటి పడితే స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. తాగిన మద్యం సీసాలు పగలగొడుతూ మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పెద్దపెద్ద అరుపులు, శబ్దాలు చేస్తూ భయాందోళన గురిచేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పోలీసుల గస్తీ నిర్వహించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



సైనికులకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

సైనికులకు సంఘీభావం

ప్రజాశక్తి-యంత్రాంగం

లీగల్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) విశాఖపట్నం యూనిట్ ఆధ్వర్యాన భారత సైనికులకు సంఘీభావ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు చేస్తున్న నరమేధాన్ని, దానికి సహాయం చేస్తున్న పాకిస్థాన్ కార్యక్రమాలను ముక్తకంఠంతో ఖండించారు. పౌర రక్షణలో సైనికుల నిరంతర కృషికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విశాఖపట్నం యూనిట్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ ఎన్.వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు బివి.రామాంజనేయరావు, ఉపాధ్యక్షులు చాట్ల ఆనందరెడ్డి తదితరులు మెంబర్లు పాల్గొన్నారు.

సీతమ్మధార : దేశ భద్రతలో ప్రాణాలను ఫణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని భారత దేశ ప్రజానీకం ఎన్నటికి మరవదని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు పేర్కొన్నారు. మురళీనాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా గణబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- గోపాలపట్నం : విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పెతంశెట్టి గణబాబు జన్మదిన వేడుకలను ఆయన స్వగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గణబాబును ఇటీవల మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేకును కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ గణబాబును సత్కరిస్తున్న మేయర్ పీలా తదితరులు

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్లు రద్దుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణకు టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని పోర్టు సిఐటియు నాయకులు జె.సత్యనారాయణ డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 221వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జె.సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులను, కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసే దిశగా ఉందని విమర్శించారు. ఈ సంవత్సరం రూ.724.4 కోట్ల లాభాలను సొంతం చేసుకున్న విశాఖపట్నం పోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.171 కోట్లను పన్నుల రూపంలో చెల్లించిందని తెలిపారు. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ హాస్పిటల్‌ను కేవలం లాభాల కోసం ప్రయివేటుకు అప్పగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని హరించడమే కాకుండా, ప్రజలకు మెరుగైన సేవలను అందించాల్సిన బాధ్యతను విస్మరించి, ప్రయివేటు సంస్థల ప్రయోజనాల కోసమే ఆసక్తి చూపుతుందని విమర్శించారు. 40,000 కుటుంబాలు తమ ఆరోగ్యానికి సంబంధించిన సేవలకు దూరం అవుతాయన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కార్మికులకు, ప్రజలకు హాస్పిటల్ సేవలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, సిహెచ్.త్రినాధరావు, రాము, కెఎస్.కుమార్, రాఘవులు, బి.జగన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినదిస్తున్న పోర్టు కార్మికులు

గెడ్డలో వ్యర్థాల తొలగింపునకు చర్యలు



గెడ్డలో వ్యర్థాల తొలగింపునకు సిద్ధమవుతున్న ప్రత్యేక బృందం

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి వంశీనగర్‌లో గతవారం కురిసిన వర్షానికి గెడ్డ పొంగిపొర్లి ప్లాస్టిక్ వ్యర్థాలు కొట్టుకువచ్చి నిలిచిపోయాయి. దీంతో గెడ్డ నుంచి తీవ్రమైన దుర్గంధంతో రావడంతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వ్యర్థాలు వంశీనగర్ వద్ద నిలిచిపోవడంతో వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ స్పందించి స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై అధికారులు పలుమార్లు పర్యటించి సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రయత్నించారు. గెడ్డ శుభ్రం కాకపోవడంతో రాజమండ్రి నుంచి ప్రత్యేక బృందాలను శుక్రవారం రప్పించారు. గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. సనపల వరప్రసాద్ గెడ్డ శుభ్రత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వార్డు ప్రజలు చెత్తను గెడ్డలో వేయొద్దని, పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జోన్ 5 ఎఎంహెచ్ఒ సునీల్, ఎస్ఎస్.జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎఇ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై న్యాయవాదుల రాస్తారోకో

ప్రజాశక్తి-లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, రక్షణకు చట్టాలు చేయాలని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద (ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్) ఐలు ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం న్యాయవాదులకు లా నేస్తం పేరుతో ప్రతి నెలా రూ.5000 ఇచ్చేదని, ఈ ప్రభుత్వం వచ్చిన పిదప రూ.7000కు పెంచి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఏడాదవుతున్నా అమలు చేయలేదని తెలిపారు. న్యాయ మిత్ర పథకం లబ్ధిదారులకు రూ.3500కు పెంచాలని, రూ.100 కోట్లతో న్యాయవాదుల కార్పస్ ఫండ్ ఏర్పాటుచేసి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని, ప్రతి న్యాయవాదికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.15 లక్షల ప్రమాద బీమాను కల్పించాలని, అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రత్యేక న్యాయస్థానాలలో రిటైర్డ్ న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులను కూడా నియమించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో కరపత్రాలను కోర్టులో పంపిణీచేశారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షులు అల్లు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు బివి.రామాంజనేయరావు, ఉపాధ్యక్షులు చేట్ల ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

'ఉపాధి' కూలి చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పెందుర్తి : ఉపాధి హామీ చట్టం కూలీలకు బకాయి కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. సిఐటియు పెందుర్తి జోన్ కమిటీ ఆధ్వర్యాన మండలంలోని గోరపల్లి, కరకవానిపాలెం గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రదేశాల్లో శుక్రవారం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టం పరిరక్షణ, బకాయిలు చెల్లింపు, కనీస కూలి రూ.600, ఏడాదికి 200 పనిదినాలు తదితర డిమాండ్ల కోసం కూలీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వేసవి అలవెన్స్, మంచినీరు, పనిముట్లు, టెంట్లు, పే స్లిప్పు, మేట్లకు పారితోషికం, ప్రమాద బీమా రూ.5 లక్షలు తదితర డిమాండ్ల సాధనకు ఐక్యం కావాలని కోరారు.

సిఐటియు పెందుర్తి రూరల్ నాయకులు ఎస్.పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. చట్ట ప్రకారం వారం రోజులు లోపే కూలి డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా 45 రోజుల నుంచి ఇవ్వకపోవడం బాధాకరమనానరు. తక్షణమే బకాయి కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.



ప్రదర్శనలో ఉంచిన విత్తనాలు

విత్తనాల ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : వరికంకుల గుత్తులు తోరణాలు తయారీపై శిక్షణ , విత్తనాల ప్రదర్శనను శుక్రవారం పౌరగ్రంథాలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ, దేశీయ విత్తనాలతో పండే పంటలే ఆరోగ్యకరం అన్నారు. కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు 130 రకాలు ప్రదర్శనలో ఏర్పాటు చేసామన్నారు. దేశీయ విత్తనాల సేకరణ, పునరుత్పత్తికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దేశంలో 10 వేల సంవత్సరాల క్రితం నుంచి విత్తనాలు దాచుకుంటూ వస్తున్న వారి వద్దకు వెళ్లి ఈ విత్తనాలను సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డు రీజనల్ ఎగ్జిక్యూటివ్ జానకీరావు, జివిఎంసి ఎస్ఆర్‌యు ప్రతినిధులు దివ్య, ప్రమీల, మంగరాజు, ఎవిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అర్చన, ఎస్ఎఫ్ఎస్ విద్యా సంస్థ అధ్యాపకులు శివలక్ష్మి, వనమాలి సిటిజి అడ్మిన్ మళ్ల సరిత, వనమాలి ఇన్‌ఛార్జిలు ఆత్మాంబిక, రేఖ, ఉష, మినియేచర్స్ ఇన్చార్జి రమాదేవి, గ్రీన్ వాలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా కుట్టు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -యంత్రాంగం

మాధవధార : జివిఎంసి 53వ వార్డు పరిది కంచరపాలెం శివనగర్ గ్రంథాలయంలో ఐద్వా ఆధ్వర్యాన కుట్టు శిక్షణా తరగతులు పున్ణ ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులను ఐద్వా సీనియర్ నాయకులు ఎం.జయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు తమ కాళ్లపై తాము నిలబడడంతో పాటు కుటుంబానికి ఆర్థికంగా సహాయ పడటానికి ఈ కుట్టు శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఇంతవరకు ఐదు బ్యాచ్‌లు శిక్షణ పూర్తిచేసుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎం.సుజాత, సిహెచ్.సుమిత్ర, కుట్టు శిక్షణ తరగతుల టీచర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతల నడుమ



ధరలపై సామాన్యుల ఆందోళన

- అదును చూసి దోచుకుంటున్న వ్యాపారులు

- నియంత్రణకు ప్రభుత్వం, అధికారులు ప్రతిష్ట చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఉగ్రవాదుల దుశ్చర్యపై భారత్ సైన్యం చేస్తున్న ఎదురు దాడి, చూపుతున్న తెగువను ప్రతి భారతీయుడు మెచ్చుకుంటున్నారు. కుల మతాలు, ప్రాంతాలు, జాతులు అన్న తేడా లేకుండా దేశ ప్రజానీయం మొత్తం ఏకతాటిపై నిలుస్తోంది.

మరో వైపు సామాన్యులు తమ జీవన పరిస్థితులపై ఆందోళన చెందుతున్నారు. మరి ముఖ్యంగా మార్కెట్లో నిత్యవసరాల ధరల ప్రభావం ఏ మేరకు ముంచుకొస్తుందో అనే భయాందోళన పలువురు వ్యక్తపరుస్తున్నారు. ప్రతి సందర్భంలోనూ వ్యాపారులు అదును చూసి ధరలు పెంచడం పరిపాటిగా వస్తుంది. ఈ నేపథ్యంలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగిపోయే అవకాశం కనిపిస్తుంది. స్టాక్ కొరతను చూపించి కూడా పెంచేసే వాళ్ళు ఉండటంతో సామాన్యుల్లో ఆందోళన కనిపిస్తోంది. ప్రభుత్వం ముందస్తుగా ధరల నియంత్రణకు పక్కగా చర్యలు చేపట్టకపోతే కరోనా నాటి పరిస్థితులు సంభవించే అవకాశాలను కొట్టేయలేమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఐదు సంవత్సరాల క్రితం ఇదే సయయంలో తలెత్తిన కరోనాలో సామాన్యులు ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడ్డారు. మార్కెట్లో ధరలు ఆకాశాన్నంటాయి. నాటి వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి ఇష్టారాజ్యంగా ధరలను పెంచేశారు. అప్పట్లో ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా, పర్యవేక్షణ టీమ్‌లు ఏర్పాటు చేసినా ఎక్కడా ధరల నియంత్రణ అనేది కానరాలేదు. దీంతో అనేకమంది అతి కష్టం మీద జీవనం సాగించారంటే అతిశయోక్తి లేదు.

ఇప్పుడు భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ ఛాయలు అలుముకోవడంతో ఈ ప్రభావం ధరలపై ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వంటనూనె, పెట్రోల్ వంటి ధరలు విపరీతంగా పెరిగినా ఆశ్చర్యపడనక్కరలేదని అంటున్నారు. ప్రభుత్వం ముందుగానే మేలుకోకుంటే ప్రజలపై ధరల భారాలు పడే అవకాశాలు ఉన్నాయన్న భావనను పలువురు వ్యక్తపరుస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, మార్కెటింగ్ శాఖ, మార్కెట్ కమిటీలు సమన్వయంతో ధరలు పెరగకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇందు కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలి.

ధరలు పెరిగితే కష్టమే



మార్కెట్లో ధరలు పెరిగిపోతే సామాన్యులమైన మేము బతకడం చాలా కష్టంగా మారుతుంది. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి పెట్టకపోతే నా సంపాదన తినడానికి కూడా సరిపోదు. కరోనా కాలంలో కూడా ఇబ్బంది పడ్డాం.

- శంకర్, టైలర్, అనకాపల్లి

జన జీవనంపై పడకుండా చర్యలు చేపట్టాలి



ఉగ్రవాదులను ముట్టపెట్టడంలో దేశం చూపే తెగువపై నేను చాలా ఆనందిస్తున్నాను. అయితే ఈ యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో సామాన్యుల జీవనంపై భారం పడకుండా ప్రభుత్వం పక్కాగా చర్యలు తీసుకోవాలి. కృత్రిమ కొరత చూపించి ప్రజలను ముంచేసే వ్యాపారులు ఉన్నారు. అటువంటి దానికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి.

- శ్రీను, అనకాపల్లి

పిఏసిఎస్ రైతులకు పారదర్శక సేవలు

అధికారులకు జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపరాణి ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రైతులకు కచ్చితమైన పారదర్శక సేవలు అందించాలని జిల్లా సహకార అధికారి ఎ.ప్రేమ స్వరూప రాణి ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బందికి కంప్యూటరీకరణ ప్రాజెక్టులో భాగంగా ఈఆర్పీలో ఈపిఏసిఎస్ ఆడిట్ నిర్వహించడం కోసం ఆడిట్ మాడ్యూల్‌పై సహకార శాఖ ఆడిటర్లు చార్టర్డ్ అకౌంటెంట్లకు ఆచరణాత్మక శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ స్వరూపరాణి, మాట్లాడుతూ ఈఆర్పి సైన్-ఆఫ్‌ను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసి ఈపిఏసిఎస్‌లో చేరినందుకు పిఏసిఎస్ పిఐసిలు సీఈఓలకు కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పిఏసిఎస్ ఆడిట్‌ను ఈ-ఆడిట్ ప్రక్రియలో పూర్తి చేయాలని సూచించారు. పిఏసిఎస్‌లు కంప్యూటరీకరణ పూర్తయినందున రైతులకు వేగవంతమైన, ఖచ్చితమైన, పారదర్శక సేవలను అందుతాయని వివరించారు. కార్యక్రమంలో యలమంచిలి డివిజనల్ కోఆపరేటివ్ అధికారి పిఎస్ఎల్ కిరణ్ కుమారి, అనకాపల్లి డిపిడిఎం శ్రీవిద్య, సహకార శాఖ ఆడిటర్లు, ఛార్టర్డ్ అకౌంటెంట్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ స్వరూపరాణి

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్‌రావు పిలుపునిచ్చారు. అచ్చుతాపురంలో శుక్రవారం జరిగిన సమావేశం సిఐటియు మండల కార్యదర్శి కె సోమునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె జరుగుతుందని, అన్ని తరగతుల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామ సదాశివరావు, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, అంగన్వాడీ నాయకులు నారాయణమ్మ, మిడ్డేమీల్స్ నాయకులు కృష్ణవేణి, ఐకెపి యూనియన్ రమణ, ఆటో యూనియన్ నాయకులు కర్రి.నాయుడు, ముఠా నాయకులు సత్యనారాయణ, రవి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు జివిఎంసి కార్మికులంతా సమాయత్తం కావాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చెయ్యాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, ఆలోగా మినిమం టైం స్కేల్ అమలు చెయ్యాలని, ఆప్కాస్‌ను రద్దు చేయకుండా దానిలోని లోపాలను సరిదిద్దాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాద్, గొలగాని అప్పారావు, నాగరాజ, గణేషు, ఎం.ఈశ్వరరావు, శ్రావణ్, శేషుబాబు, కిరణ్ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార : ఈ నెల 20వ తేదీ సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ద్వారకానగర్ బివికె.కాలేజీ వద్ద సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 20న చేపట్టే జాతీయ సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వులవల బాబ్జీరావు, ఎన్.ప్రకాష్, లక్ష్మీపతి, గొంప సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు



డ్రాయింగ్ వేసిన బొమ్మలను చూపుతున్న చిన్నారులు

ఉత్తేజంగా ఎసిసి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో జవహర్ కమ్యూనిటీ హాలులో మూడో రోజు శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ఉత్తేజంగా జరిగింది. అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుచున్న ఈ శిబిరంలో క్రాఫ్ట్ డ్రాయింగ్ టీచర్ కొముండూరి జ్యోతిర్మయి పిల్లలకు డ్రాయింగ్, క్రాఫ్ట్ నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాయింగ్ చేయడం వలన పిల్లలలో మెదడు పనితీరు మెరుగు పడి, ఒత్తిడిని తగ్గిస్తుందని చెప్పారు. సృజనాత్మకతను పెంచడంతో పాటుగా కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు, ఆళ్ల మహేశ్వరరావు, పెంటకోట వెంకట్రావు, ఆడారి రామలక్ష్మి పాల్గొన్నారు.

మండల సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకున్న కొండపాలెం గ్రామానికి చెందిన ఇరు వర్గాలతో అధికారులు సమావేశమయ్యారు. వారి ఫిర్యాదులకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ఇరు వర్గాలతో మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి గోపాల్‌రాజు, తహశీల్దార్ ఎం.లక్ష్మి ఎంపీడీవో విజయలక్ష్మి, అడిషనల్ ఎస్ఐ భాస్కరరావు, డీటీ మురళీధర్ పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న దర్శకుడు రామ్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి శ్రీనూకంబిక అమ్మవారిని చలనచిత్ర దర్శకులు రామ్ గొదల శుక్రవారం దర్శించుకున్నారు. సుహస్ హీరోగా, మాళవిక మనోజ్ హీరోయిన్‌గా తెరకెక్కించిన "ఓ బామ అయ్యో రామ" చిత్రం జూన్ నెలలో విడుదలవుతున్న సందర్భంలో అనకాపల్లి విచ్చేసి అమ్మవారి దర్శించుకన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ గంగాధర్, శ్రీబ్రాహ్మిత్ ఆలయ ధర్మకర్త పొలిమేర ఆనంద్, ఎస్ భానుచందర్ (అఖి), హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : శ్రీకాకుళం కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు రావే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.భీమవరంలో శుక్రవారం విత్తన శుద్ధి ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలను జీవ నియంత్రణ పద్ధతిలో శుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు మమత, హారిక, ప్రసన్న, ప్రశాంతి, హేమలత, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు 'అన్నదాత సుఖీభవ'

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులందరికీ పెట్టుబడి సాయం రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం ద్వారా సంవత్సరానికి రూ.20వేలు రైతు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. ముందుగా రైతు సేవ కేంద్రం సిబ్బంది ఆన్లైన్లో ఉన్న రైతుల సమాచారాన్ని తనిఖీ చేసి ఆమోదిస్తారని తెలిపారు. రైతు వివరాలను వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది తనిఖీ చేసి జాబితాను తయారు చేసిన పిదప అర్హులైన రైతులందరు ఈకెవైసి చేయించుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం మే నెల 20వ తేదీ లోపు అన్నదాత సుఖీభవ ఆన్లైన్ పోర్టల్‌లో ధ్రువీకరణ కొరకు ఆదేశించడం జరిగిందన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఉమ్మడి భూములు కలిగి ఉంటే వారిలో ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉన్న వారి బ్యాంకు ఖాతాకు నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములకు సమాన శాతం భూమి వాటా ఉంటే ఎవరైతే ఆ ఇంటికి పెద్దవారో బ్యాంకు ఖాతాకు నిధులు విడుదల చేస్తారని తెలిపారు. కౌలు రైతు కార్డు కలిగి ఉన్న వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. వ్యవసాయ/ ఉద్యాన/పట్టు పరిశ్రమకు సంబంధించిన పంటలు సాగుచేస్తున్న రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది, బుచ్చయ్యపేట, బంగారుమెట్ట జంక్షన్, రాజం, సీతయ్యపేట జంక్షన్లో తదితర ప్రాంతాల్లో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా పరిశీలించారు. బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద దొంగతనం జరిగిన నేపథ్యంలో అనుమానితులను చెక్ చేశారు.

వికలాంగులకు ఉచిత మెగా డిఎస్సి శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో డిఎస్సీకి అర్హులైన వికలాంగ అభ్యర్థుల కోసం ఉచిత మెగా డిఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.ఆశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ వంటి వికలాంగులైన ఎస్జిటి టీచర్ పోస్టులకు అర్హతగల వికలాంగ అభ్యర్థుల కోసం విజయవాడలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 40 శాతం వికలాంగత్వం ఉన్నవారు అర్హులని, ఈ నెల 11వ తేదీలోగా mdfc.apefss.in వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెట్లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో శిక్షణా, స్టడీ మెటీరియల్ పంపిణీ, ఉచిత వసతి, భోజనం సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

12 నుండి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-సబ్బవరం : ఈ నెల 12 నుండి 20వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పి.సుభాషిణి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ బి. రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు జరుతాయని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 99 మంది, రెండో సంవత్సరం 34మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రంలో అన్ని మౌళిక వసతులతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

15న మెగా జాబ్మేళా

ప్రజాశక్తి - యలమంచిలి : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 తేదీన యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే సందరపు విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో జాబ్మేళాకు చెందిన గోడపత్రికను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని నిరోద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఈ జాబ్మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలో 15 బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అచ్చుతాపురం : ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గోడపత్రికను శుక్రవారం అచ్చుతాపురంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆవిష్కరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ జాబ్ మేళాకు హాజరై ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి ఎన్ గోవిందరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : నక్కపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ డి.దుర్గాభవానీ కుటుంబానికి భద్రత ఎక్స్ గ్రేషియా రూ.4 లక్షలు మొత్తాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ చేతుల మీదగా మృతురాలి తల్లి చందక రాధకు శుక్రవారం అందజేశారు. మహిళా కానిస్టేబుల్ దుర్గాభవాని సేవలు మరువలేనివని అదనపు ఎస్పి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-నకాపల్లి : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అనకాపల్లి నియోజవర్గానికి చెందిన నలుగురికి మంజూరైన చెక్కులను జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం అందజేశారు. లబ్ధిదారులు లక్కరాజు గోవిందరావుకు రూ.45వేలు, నున్నం ప్రవీణ్ రూ.2,02,693, యలమంచిలి నాగలక్ష్మికు రూ.20వేలు, సేనాపతి సంతోషి కుమారికి రూ.20వేలు, గోకివాడ దినేష్కు రూ.39,222 అందించారు. ఏ సమస్యలున్నా పార్టీ ఆఫీసులో సంప్రదించాలని ఈ సందర్భంగా రాంకీ తెలిపారు.

అవసరాలకు ఇసుక, గ్రావెల్, మట్టి తోలుకోవచ్చు

మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-చోడవరం : తమ అవసరాల కోసం ఇసుక, గ్రావెల్, మట్టిని యథావిధిగా తోలుకోవచ్చని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి గాడి కాసు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చెరువుల్లో మట్టి రైతులు తీసుకెళ్తుంటే కొంతమంది అధికారులకు ఫిర్యాదులు చేసి అడ్డుకుంటున్నారని, అటువంటి వారిని మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులందరూ కలిసి వ్యతిరేకించాలని సూచించారు. స్థానిక అవసరాల కోసం గ్రావెల్, ఇసుక వంటివి తోలుకోవచ్చని ఈ సందర్భంగా తహశీల్దారు రామారావుకు, సిఐ అప్పలరాజుకు ఎమ్మెల్యే సూచించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులకు నెల రోజులు గడువు ఉందని, ముందేగానే అందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాఠశాలల భవనాల నిర్మాణాలను, మరమ్మతులను సెలవుల్లో పూర్తి చేయాలన్నారు. తమకు వేతనాలు చెల్లించాలని ఎంపిటిసిలందరూ కోరగా, ఎమ్మెల్యే కలుగజేసుకుని తాము అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఉన్న బకాయిలను మండల జనరల్ ఫండ్ నుండి ఇవ్వాలని ఎంపిడిఓను ఆదేశించారు. రేషన్ కార్డులకు సంబంధించి ఎటువంటి సర్టిఫికెట్స్ ఉన్నా వెంటనే మంజూరు చేస్తామని తహశీల్దారు రామారావు తెలిపారు. ఎంపీడీవో ఆంజనేయులు, వైస్ ఎంపీపీ బైన కుమారి ఈశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

తప్పుడు ప్రచారంపై కేసులు వేస్తా

కింతాడ మాజీ సర్పంచ్ నరసింహనాయుడు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నరసింహనాయుడు

ప్రజాశక్తి-కె.కోటపాడు : తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేని కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై కేసులు వేయడం జరుగుతుందని టిడిపి మండల నాయకుడు, కింతాడ మాజీ సర్పంచ్ బండారు అరుణ నరసింహనాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం తన స్వగృహంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తానో భూకబ్జాదారుడనని, అనేకమంది భూములు లాక్కొని లబ్ధి పొందుతున్నానని ఇటీవల సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తూ తీవ్ర అవమానాలకు గురిచేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు నిస్వార్థంగా రాజకీయాలు చేశానని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. తన దగ్గరున్నవి తన తాత ముత్తాతల నుండి సంక్రమించిన భూములు తప్ప తాను ఎవరి భూములు కబ్జా చేయలేదని స్పష్టం చేశారు. కేవలం నాలుగు సర్వే నెంబర్లలో సుమారు 20 సెంట్లు భూమి పొరపాటున నమోదు కాగా, వాటిని నా పాసుపుస్తకం నుండి తొలగించాలని ఏనాడో తహశీల్దారుకు లిఖితపూర్వకంగా రాసిచ్చినట్లు చెప్పారు. టిడిపిలో క్రమశిక్షణ గల సైనికుడిలా పని చేస్తున్నానని, అలాంటిది తనను పార్టీ నుండి సస్పెండ్ చేశారని కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. టిడిపిలో తనకు ఎప్పుడూ సముచిత గౌరవం ఉంటుందన్నారు. గొల్లలపాలెం, కింతాడ నాయకులు బొట్ట కొనారి, శివ సన్యాసినాయుడు మాట్లాడుతూ రాజకీయంగా కొంతమంది చేసిన తప్పుడు ఆరోపణలకు పంచాయతీలోని ప్రజలెవరూ నమ్మలేదని తెలిపారు. సమావేశంలో లాలం సత్తిబాబు రిటైర్డ్ పాల సంఘం కార్యదర్శి మల్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంగళాపురం ఆనకట్ట మరమ్మతులకు రూ.4లక్షలు

చెక్కు అందజేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆనందకుమార్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని మంగళాపురం ఆనకట్ట మరమ్మతు పనులకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ రూ.4 లక్షలు మంజూరు చేశారు. స్థానిక రైతులు, కూటమి నాయకుల విజ్ఞప్తి మేరకు అసంపూర్తిగా నిలిచిపోయిన ఆనకట్ట పనులకు తొలివిడతగా విశాఖ డెయిరీ ట్రస్ట్ నుండి రూ.4లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ ఆనకట్ట పరిధిలో కుముందాంపేట, విజయరామరాజుపేట, మంగళాపురం, చీడికాడ మండలం దండిసురవరం, దిబ్బపాలెం, చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామాల పరిధిలో సుమారు 3,500 ఎకరాల ఆయకట్టు ఉంది. 2018లో సంభవించిన వరదలకు ఆనకట్ట కొట్టుకుపోయింది. కోనాం రిజర్వాయర్ నుంచి వచ్చిన నీరు దిగువకు వెళ్లిపోతుంది. ఆనకట్టను పునర్నిర్మించాలని రైతులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోయింది. 2019లో రైతులు చందాలు వేసుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. అయితే 2021 సెప్టెంబరులో వరద ఉధృతికి ఆనకట్ట మళ్లీ కొట్టుకుపోయింది. నాటి నుండి ఆనకట్టను పునర్నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆ ఏడాది డిసెంబరులో ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఆనకట్టను పరిశీలించి, పునర్నిర్మాణ పనులు చేపడతామని, 2022 ఖరీఫ్ నాటికి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. కాని నిధులు మంజూరు చేయకపోవడంతో ఆనకట్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్కుమార్ గతవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దానిలో భాగంగా డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ చేతుల మీదుగా విజయరామరాజుపేట మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్కు రూ.4 లక్షల చెక్కును అందజేశారు. వెంటనే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంగళాపురం టిడిపి నేత పత్తి రామారావు పాల్గొన్నారు.



రూ.4 లక్షల చెక్కు అందిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్కుమార్

వెబ్సైట్లో టెన్త్ షార్ట్ మెమోలు : డిఇఒ

ప్రజాశక్తి-అనకాపల్లి : 2025 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాల షార్ట్ మెమోలు పాఠశాల విద్యాశాఖ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ మెమోలు (సబ్జెక్టుల వారీగా మార్కుల మెమోరాండం) ఈ నెల 8వ తేదీ నుండి వెబ్సైట్లో అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్ ఆధారాలను ఉపయోగించి "సబ్జెక్టుల వారీగా మెమోరాండం"ని డౌన్లోడ్ చేసుకుని, సంతకం చేసిన కాపీలను సంబంధిత పాఠశాలల విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మెమోలలో గుర్తించిన ఏవైనా సవరణలను ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లలో సవరణలు చేయడానికి ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ వారి దృష్టికి ప్రధానోపాధ్యాయుడు, తల్లిదండ్రులు తీసుకురావాలని తెలిపారు.ఏవైనా సవరణలు ఉంటే అవసరమైన పత్రాలను కోరారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచిస్తూ, సవరణలకు అడ్మిషన్ రిజిస్టర్కు సరిగ్గా జతచేయబడిన పాఠశాల రికార్డుల రుజువు, ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన షార్ట్ మెమో (సబ్జెక్ట్ వారీగా మార్కుల మెమోరాండం) కాపీ అందజేయాలని తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పైన తెలిపిన ఆధారాల పత్రాలతో ఈనెల 25లోపు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడకు పంపాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్ శిరీష రాణి అన్నారు. మండలంలోని వెదురువాడలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేసినట్లయితే పంచాయతీకి ఆదాయంతో పాటు సేంద్రియ ఎరువులు తయారు చేయడానికి వీలు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి చందక శ్రీరాముల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట పంచాయతీలో ఎంపీడీవో సువర్ణరాజుతో కలిసి మండల ప్రత్యేకాధికారి ఎస్.మంజులవాణి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. శానిటేషన్ సిబ్బంది, స్థానికులతో కలిసి అధికారులు చీపురులు పట్టుకొని గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రాథమిక పాఠశాల, వెటర్నరీ ఆస్పత్రి పరిసరాలను శుభ్రపరిచి, సంపద తయారీ కేంద్రం వెనక భాగంలో జంగిల్ క్లియరెన్స్ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, తడి చెత్త, పొడి చెత్త సేకరణపై హరిత రాయబారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి పుష్ప, ఇంచార్జ్ హౌసింగ్ ఏఈ తేజ, ఏపిఎం ప్రభాకర్, ఇంచార్జ ఈవోపిఆర్డి అనంత ఉమాదేవి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి జీవన్ బాబు, ఎమ్మార్సీ పైడిరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి భువనేశ్వరి పోలి క్లినిక్ ఆధ్వర్యంలో తుమ్మపాల పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 50 మందికి వివిధ కంటి సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురు శస్త్ర చికిత్సకు ఎంపిక కాగా, 35 మందికి సత్వారం, 20 మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చెదరు నాగేశ్వరరావు, భారతి, వెంకటలక్ష్మి, కన్నారావు, వార్డు మెంబర్లు తర్ర సత్య రావు, యన్నం శెట్టి రామారావు, రవ్వ శ్రీను, డాక్టర్ నరసింహమూర్తి, సిబ్బంది నాగేశ్వరి, తులసి, మహేష్ పాల్గొన్నారు.

రిజిస్టర్ కార్యాలయానికి తాకిడి

- మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం బారులు
- నూతన రేషన్ కార్డులకు తప్పనిసరి



కార్యాలయానికి వచ్చిన ప్రజలు

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణలో కార్డులో మార్పులు, చేర్పులు, నూతనంగా పెళ్లయిన వారికి పెళ్లి ధృవపత్రం తప్పనిసరి కావడంతో స్థానిక రిజిస్టర్ కార్యాలయంలో గడిచిన రెండు రోజులుగా సందడి నెలకొంది.దరఖాస్తుదారులు పెళ్లి కార్డు, పెళ్లి ఫోటోతో పాటు రిజిస్టర్ కార్యాలయంలో ధృవపత్రం అప్లోడ్ చేయవలసి ఉన్న తరుణంలో రిజిస్టర్ కార్యాలయాలకు వధూవరులు క్యూ కడుతున్నారు. ఇటీవల పెళ్లి చేసుకున్న దంపతులతో పాటు గతంలో పెళ్లి చేసుకున్న దంపతులకు కూడా పెళ్లి ధ్రువపత్రం తప్పనిసరి చేయడంతో కార్యాలయం కిటకిటలాడుతుంది, కోటవురట్ల, నాతవరం మాకవరపాలెం మండలాలకు సంబంధించిన రేషన్ కార్డు దరఖాస్తుదారులు మండల కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు, ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, కార్యాలయ సిబ్బంది దరఖాస్తుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేస్తున్నామని సబ్ రిజిస్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.



పరిశుభ్రం చేస్తున్న హెటిరో ఉద్యోగులు

హెటిరో ఆధ్వర్యంలో శ్రమదానం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో హెటిరో డ్రగ్స్ యాజమాన్యం పిలుపుమేరకు శుక్రవారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ ఉద్యోగులు, హౌస్ కీపింగ్ సిబ్బంది ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించి, పరిశుభ్రం చేశారు. ప్రతి నెలా ఒక రోజు కంపెనీ యాజమాన్యం పిలుపుమేరకు శ్రమదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు యస్. కుల్లా రెడ్డి, ఎమ్.సుబ్బారెడ్డి, యస్. రాజారెడ్డి సత్యనారాయణ, వంశీ, సిఎస్ఆర్ టీం ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఫుడ్ ప్యాకెట్‌ను ఇస్తున్న నిర్వాహకులు

గర్భిణులకు ప్రోటీన్ ఆహారం అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సత్యసాయి సేవా సమితి (శారద నగర్) ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ ఫుడ్ అందించినట్లు శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ రామకృష్ణ మాస్టర్ తెలియజేశారు. స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో 75 మంది గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ ఫుడ్ అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 15 మంది సాయి భక్తులు పాల్గొన్నారు. ప్రోటీన్ ఫుడ్‌ను బొడ్డ ప్రసాద్, సత్య దేవి కుమార్తెలు ప్రత్యూష నైమిశా ఆర్థిక సహకారంతో అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కనకరాజు , రత్నకుమారి సత్య సాయి భక్తులు పాల్గొన్నారు.

అవంతిలో నమూనా పరీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల:ఈనెల తొమ్మిది నుంచి 15 వరకు మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రవేశ నమూనా(ఎంసెట్) పరీక్ష నిర్వహించనున్ననట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు తెలిపారు, కళాశాల యాజమాన్యం నిర్వహించే ఈ మాక్ టెస్టుకు విద్యార్థులు హాజరైతే భయాందోళన తొలగి పోతుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ గోవిందు, డానియల్ రాజు పాల్గొన్నారు.

మీ కోసంలో 55 వినతులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 55 వినతులు అందాయి. సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగవెంకట సాహిత్, డిఆర్ఒ కె.పద్మలత సంయుక్తంగా వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 55 ఫిర్యాదులను స్వీకరించారు. జి.మాడుగుల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వి.కొండలరావు మెయిన్ రోడ్డు నుండి గ్రామానికి సిసి రోడ్డు నిర్మించాలని, హుకుంపేట మండలం కేంద్రానికి చెందిన పాడి బాలన్న అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ బొడంగి పాడు గ్రామానికి చెందిన వంతాల లక్ష్మయ్య, గొల్లోరి శ్రీను, కొర్ర సత్యారావు, తదితరులు తమ గ్రామనికి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో డిపిఒ పిఎస్ కుమార్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌కు చెత్త తరలింపు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి మండలం నుండి కాపులుప్పడ పవర్ ప్లాంట్ కు లారీ తో డ్రై వేస్ట్ చెత్తను తరలించినట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు డిపిఓ కార్యాలయం నుండి చెత్తను తరలించేందుకు లారీ పంపించారని, లారీలో చెత్తను లోడ్ చేసి శుక్రవారం పంపించినట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ వీసం రాజు,ఇన్చార్జి ఈ ఓ పి ఆర్ డి ఎం శ్రీను, కార్యదర్శులు పాల్గొన్నారు.



చెత్తను తరలిస్తున్న అధికారులు

సమస్యలపై ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయులు, పాఠశాల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధర్మారావు, వై శ్రీనివాస్, నూకేష్, సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించి, ఐఆర్ ప్రకటించాలని ఎపిటిఎఫ్ (257) జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను తక్షణమే ప్రకటించాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలతో పాటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న విజయ్ ప్రకాష్

శ్రీ ప్రకాష్‌లో ముగిసిన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి- నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలలో గత 15 రోజులుగా విద్యార్థులకు వివిధ ఆటలు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ క్రాఫ్ట్, సంగీతం, స్కేటింగ్, కంప్యూటర్ బేసిక్స్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఖో-ఖో, వాలీ బాల్, క్రికెట్, కబడ్డీ, స్కేటింగ్ తదితర అంశాల పై కోచ్ లతో మెలుకువలను నేర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి కనబరచడం ఆనందదాయకమన్నారు. క్రీడల పట్ల శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తాయన్నారు. సమ్మర్ క్యాంపులో క్రీడల్లో నేర్చుకున్న మెలుకువలు నిరంతరం కొనసాగించాలన్నారు. రోజూ ఒక గంట సమయాన్ని వ్యాయయాయం, క్రీడల కోసం కేటాయించాలని సూచించారు. ఆటల ద్వారా గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే స్థైర్యం అలవడుతుందన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు తమ విద్యా సంస్థలో విద్యలో ఒక భాగమని తెలిపారు. అనంతరం క్యాంపు లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ ఆటలకు చెందిన కోచ్‌లు, పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

డ్రోన్లతో అసాంఘిక ప్రదేశాల గుర్తింపు

ప్రజాశక్తి:రావికమతం: డ్రోన్ సహాయంతో బహిరంగ ప్రదేశాలలో మద్యపానం, గంజాయి రవాణా వంటి అసాంఘిక ప్రదేశాలను గుర్తించేందుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పలు ప్రదేశాలలో డ్రోను ఎగరవేయడం జరిగిందని రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రావికమతం, కవగుంట, కొట్నాబెల్లి, చినపాచిల ప్రాంతాలలో డ్రోన్‌ను ఎగరవేయడం జరిగిందని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో గుంపులు గుంపులుగా కూర్చుని మద్యం సేవించడం, నాటుసారా విక్రయించడం, తయారు చేయడం, గంజాయి రవాణా ప్రాంతాలను గుర్తించుటకు ఎంతగానో ఉపయోగపడు తుందని ఆయన తెలిపారు. బహిరంగంగా మద్యపానం సేవిస్తున్న ముగ్గురు పై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.23 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కన్నంపేట గ్రామానికి చెందిన విద్యార్థి సియాద్రి మణికంఠకు కొత్తకోట పి ఎస్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ 23 వేల నగదు సాయంను శుక్రవారం అందించారు. ఇటీవల 10వ తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి ఆకస్మికంగా ప్లేట్ రేట్స్, హార్ట్ బీట్ తగ్గడం, ఊపిరి తిత్తుల సమస్యతో బాధ పడుతూ విశాఖపట్నం హాస్పిటల్లో చికిత్స పొందు తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి కావడంతో మణికంఠకు సాయం అందించాలన్న సంకల్పంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నాగేశ్వరరావు సూచన మేరకు పలువురు పాఠశాల ఉపాద్యాయులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో కుటుంబ సభ్యలకు నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.నాగేశ్వరరావు, ఇన్చార్జ్ హెచ్ఎం వాసవిలత, ఉపాధ్యాయులు కన్నయ్య దొర తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట పి హెచ్ సి పరిధిలో చీమలపాడు శివారు కుంజర్తి, పెడింపాలెం ఆదివాసీ గిరిజన గ్రామాలలో కొత్తకోట పి హెచ్ సి వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ వ్యాధులకు ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మోహిని సురేఖ మాట్లాడుతూ, ఈ శిబిరంలో ఇద్దరికి జ్వర తీవ్రత ఉండడంతో వారికి కిట్ ద్వారా మలేరియా టెస్ట్ చేయగా నెగిటివ్ అని నిర్ధారణ అయ్యింద న్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తే మలేరియా వ్యాధిని నివారించ వచ్చునని వైద్యాధికారి అన్నారు. దోమకాటుతో మలేరియా వ్యాధి వస్తుందని, ఈ దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజనులకు సూచించారు. రాత్రి సమయంలో దోమతెరలు వాడాలని చెప్పారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా పి హెచ్ సి కి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అంతకు ముందు రెండు గ్రామాలలో మలేరియా వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రామారావు, వైద్య సిబ్బంది రమణ, ఉషారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి

విజన్ 2047పై సమీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సచీదేవి, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో విజన్ 2047 ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విజన్ 2047 ప్రణాళిక అమలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేటలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా పిక్కి గంగరాజు, ఉపాధ్యక్షులుగా పిక్కి నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా సిరిపల్లి అప్పలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ముడి సోమేష్, దైలపల్లి శ్రీను, పిక్కి లక్ష్మణ్, గ్రామ కార్యదర్శిగా చేపల రామకృష్ణ, యజ్జల లోవరాజు, పిక్కి జగ్గ, గ్రామ కోశాధికారిగా చోడిపల్లి అప్పలరాజు, బూత్ కన్వీనర్‌గా మైలపల్లి ప్రసాద్, బొంది దార్ల లతో కమిటీని నియమించారు. మూడవసారి గ్రామ శాఖ అధ్యక్షులుగా నియమించినందుకు హోంమంత్రి అనిత, వెంకటేష్, టిడిపి శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లపై కూటమి కొర్రీలు

- భర్తల మృతితో భారంగా మారిన బతుకులు
- ప్రభుత్వ నిబంధనలతో అందని పింఛన్లు
- ఆవేదనలో లబ్ధిదారులు



పూరి గుడిసెలో ఉంటున్న చినతల్లి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఇంటికి జీవనాధారమైన భర్త మరణిస్తే భార్యకు బతుకు భారం కాకుండా వితంతు పింఛన్తో ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కొర్రీలు వేస్తుంది. భర్త పింఛన్ పొందుతూ మరణిస్తేనే భార్యకు వితంతు పింఛన్ అందించేందుకు కూటమి ప్రభుత్వం కొర్రీలు పెడుతోంది. దీంతో మండలంలోని పలువురు వింతువులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెట్టిన మెలికతో పింఛన్ వస్తుందనుకున్న వితంతువులు అయోమయంలో పడ్డారు. 2023 డిసెంబర్ 1 తర్వాత మృతి చెందిన వారి కుటుంబాలు మాత్రమే వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం అధికారులు తెలియజేయడంతో అర్హత ఉండి పింఛన్ రాని వితంతువులు ఒక్కసారిగా కుంగిపోయారు. 2023 నుండి 80 మంది వితంతువులు దరఖాస్తు చేసుకోగా మండలంలో ఆరుగురు మాత్రం పింఛనుకు నోచుకోలేదు. ఇందులో నీలంపేట కు చెందిన చెవ్వేటి నూకరత్నం, యామగిరి చిన్నతల్లి, కోడి కళ్యాణం, గురొందరపాలెం నకు చెందిన పిట్టా గంగరాజు, వళ్ళు సోమలమ్మ, వేములపూడికి చెందిన బోళెం అమ్మన్న అనే వితంతువులకు స్పౌజ్ కోటా పింఛన్లు పొందేందుకు ప్రభుత్వం నూతనం విడుదల చేసిన నిబంధనలతో అనర్హులుగా మారారు. నీలం పేటకు చెందిన దళిత వితంతు మహిళలు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్కు నోచుకోలేదని బోరున విలపిస్తున్నారు. కొత్తగా వితంతు పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులు అధికారులు పరిశీలించగా 6గురు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద వితంతువులకు ప్రభుత్వ నిర్ణయం ఆశని పాతంలా తయారైంది. అర్హత ఉన్నా తమకు పింఛన్ మంజూరు చేయకపోవడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ కాలంలో నూతన పింఛన్లు మంజూరు కాకపోవడంతో కూటమి ప్రభుత్వమైనా పింఛన్లు మంజూరు చేస్తుందని కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెట్టిన మెలికతో పింఛన్ వస్తుందనుకున్న వారు అయోమయంలో పడ్డారు. 2023 డిసెంబర్ 1 తర్వాత మృతి చెందిన వారి కుటుంబాలు మాత్రమే వితంతు పింఛన్లకు దరఖాస్తులు తీసుకోవాలని అధికారులు తెలియజేయడంతో అర్హత ఉండి పింఛన్ రాని వితంతువులు ఆవేదన చెందుతున్నారు. 2023 నుండి ప్రజా ప్రతినిధుల వద్దకు, మండల, పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గత మూడేళ్లుగా పింఛను రాక వితంతువులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2023 డిసెంబర్ 1వ తేదీకి ముందు చనిపోయిన వారి కుటుంబాల నుంచి దరఖాస్తులు తీసుకోలేదని తెలియజేయడంతో ముసలి వితంతువులు దిక్కులు చూస్తున్నారు. చిన్న పూరి గుడిసెలో జీవిస్తూ జీవనం గడుపుతున్నారు.

వృద్ధాప్యంలో బతికేది ఎలా?

2022లో నా భర్త బాలరాజు చనిపోవడంతో నా బతుకు భారమైంది. పెన్షన్ కొరకు కాగితాలు పట్టుకొని ప్రభుత్వ అధికారుల వద్దకు కార్యాలయాలు చుట్టూ తిరిగినప్పటికీ నేటికీ నాకు ఫెన్షన్ వచ్చే విధానం కనిపించలేదు. నా భర్త ఉండేటప్పుడు కష్టపడి తెస్తే కూలి నాలి చేసుకొని బ్రతికే వాళ్ళం.. కూలి చేసుకోవడానికి నా శరీరం సహకరించ లేదు. ప్రభుత్వం స్పందించి నన్ను చూసైనా ఫెన్షన్ ఇస్తుందని ఆశిస్తున్నాను.



చెవ్వేటి నూక రత్నం, నీలం పేట

కాళ్లరిగేలా తిరుగుతున్నాను

నా భర్త వృద్ధాప్యంలో ఉండడంతో పెన్షన్ వచ్చేది. నా భర్త 2023లో చనిపోయారు. నాటినుండి నాయకుల వద్దకు అధికారుల వద్దకు తిరుగుతూనే ఉన్నాను. ఇప్పటికీ నాకు వితంతు ఫెంన్షన్ రాలేదు. పింఛను అందక పోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాను. ప్రభుత్వం, అధికారులు దయతలచి నాకు పింఛను మంజూరు చేయాలి.



యామగిరి చినతల్లి, నీలం పేట

డబ్బులు లేక వంట వండుకోలేదు

మా దళిత కాలనీ వాళ్ళు నాకు పూరి గుడిసె వేస్తే అందులోనే బతుకుతున్నాను. పొయ్యి వెలిగించడానికి కూడా నా దగ్గర ఏమీ లేవు. నా భర్త డప్పు కొట్టి నా కుటుంబాన్ని నన్ను చూసేవారు. నా భర్త చనిపోయిన దగ్గర నుండి నా బతుకు భారమైంది ఎవరైనా పెడితే తిందామని ఆశగా చూస్తున్నాను. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వితంతు పెన్షన్ ఇప్పిస్తే నా బతుకు నడుస్తుంది. లేదంటే కష్టమే.



కోడి కళ్యాణం, నీలం పేట

మానసిక వ్యాధిగ్రస్తులకు ఆశ్రయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మానసిక వ్యాధితో బాధపడుతూ నగరంలోని రోడ్లమీద తిరుగుతున్న ఏడుగురు వ్యక్తులను వేర్వేరు ప్రదేశాలలో, వేర్వేరు తేదీలలో ఎయుటిడి సిబ్బంది రెస్క్యూ చేసి ఎయుటిడి జివిఎంసి టిఎస్ఆర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా చికిత్స అందించడం వల్ల చాలా వేగంగా వారు తిరిగి కోలుకున్నారు. వీరిలో బీహార్ రాష్ట్రానికి చెందిన అష్ఫ్ విజయ్, రాంబిహారి, ప్రమోద్ కుమార్, రాజ్ శ్రీపురాజ్, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంజయ్ నాయర్, శిఖందర్, రోహితాసు ఉన్నారు. పై ఏడుగురినీ వారి కుటుంబాల చెంతకు పంపించేందుకు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు చర్యలు చేపట్టారు. శ్రద్ధా టీంకు శుక్రవారం అప్పగించారు.



కోలుకున్న వ్యాధిగ్రస్తులు

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పిఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యాన శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పీలా శ్రీనివాసరావు జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో కోకొల్లలుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, నిరుద్యోగులు ఎక్కువ వేతనాల కోసం ఆరాటపడుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, అనుభవం సంపాదించి ఎదగాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి అన్ని నియోజకవర్గంలోనూ జాబ్ మేళా నిర్వహించి అర్హులందరికీ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 45 కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా సుమారు 3000 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

కళావిహీనంగా ఫ్లైఓవర్ పార్కింగ్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, వేములవలస ఫ్లైవర్ పార్కింగ్ ఏరియా కళాహీనంగా మారింది. నేషనల్ హైవే అథారిటీ రోడ్డు విస్తరణలో భాగంగా విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే వాహనాలను వేములవలస కూడలి బ్రిడ్జి కింద నుంచి మళ్లించే ఏర్పాట్లు చేశారు. బ్రిడ్జి కింద కొంత భాగం పార్కింగ్ ఏరియాకు ఉంచారు. నిత్యం వేలాదిమంది సంచరించే ఈ మార్గంలోని పార్కింగ్ ఏరియా అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఆనందపురం పూల మార్కెట్‌కు నిత్యం వందలాదిమంది రైతులు, వ్యాపారస్తులు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. ఈ విషయమై వేములవలస గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ నాయుడును వివరణ కోరగా వేములవలస పంచాయతీ పరిధిలో ఉన్న పార్కింగ్ ఏరియా హైవే అథారిటీ పరిధిలోకి వస్తుందని, వారికి ఫిర్యాదు చేశామని, వారి సహకారంతో పార్క్‌ను ఆధునికీకరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.